# సింగిల్ పేజీ కథలు

## సరైన బేరం

''తొందరగా రావాలండీ. ఈ బస్సు దాటితే మళ్లీ గంటదాకా బస్సు లేదు'' అంటూ అందరినీ తొందరపెట్టాడు శంకరం.

''ఆగండీ శంకరంగారూ. ముందు మీతో ఓ విషయం మాట్లాడాలి. లోపలకు రండి'' పిలిచాడు రామ్మూర్తి.

''సరే ఏంటో తొందరగా చెప్పండి'' అంటూ లోపలికి వచ్చాడు శంకరం.

''అదేనండీ మీరెలాగైనా బేరం సరిగ్గా కుదర్చాలి'' అన్నాడు.

''మార్కెట్‌లో ధరలు పెరిగిపోయాయి. మీరు మరీ తక్కువంటే నేను బేరం కుదర్చలేను.''

''మరీ తక్కువేం కాదులెండి. కానీ మీరు మా గురించి కాస్త ఆలోచించాలి.''

''అలాగే. నేను ఇరుపక్షాలకు బేరం కుదర్చడానికే చూస్తాను. ఆ...మీరు కదలండర్రా మళ్లీ బస్సు దాటి పోతుంది'' అంటూ రామ్మూర్తితోసహా అందర్నీ తొందరపెట్టి బయలుదేరదీసాడు శంకరం.

శంకరం ఆడపెళ్లివారిని తీసుకుని పెళ్లి సంబంధం మాట్లాడడానికి వెళ్తున్నాడు. పెళ్లిళ్ల మార్కెట్‌లో కట్నాల రేటు బాగా పెరిగిపోవడంతో రామ్మూర్తి తరపున సరైన రేటు కుదర్చడానికి ఆలోచిస్తున్నాడు.

★★★

శంకరంతో వచ్చిన ఆడపెళ్లివారిని చూసి సాదరంగా ఆహ్వానించారు మగపెళ్లివారైన సుబ్బారావు. వీళ్లను చూసి వరుని తల్లి తను కట్టుకున్న పట్టుచీర, పెట్టుకున్న నగలు ఓసారి సవరించుకుంది. ఆమె పెట్టుకున్నవి గిల్టువో, మేలిమి బంగారమోగానీ ఆమె ఒంటి నిండా నగలే ఆవరించాయి.


పదినిముషాల్లో వాళ్ల మర్యాదలు పూర్తయి అసలు విషయానికి వచ్చేసారు. వీళ్లకు, వాళ్లకు మధ్య శంకరం మధ్యవర్తి. సుబ్బారావు శంకరాన్ని పక్కకు పిలిచి తన రేటు చెప్పాడు. శంకరం వచ్చి-

''ఏమండీ రామ్మూర్తిగారూ! వాళ్లు మూడు చెప్పారండీ'' అన్నాడు.

''మరీ అంత అయితే ఎలాగండీ. నేను రెండుకన్నా ఇవ్వలేనని మీతో చెప్పాను కదండీ'' అన్నాడు రామ్మూర్తి. వెంటనే శంకరం సుబ్బారావువద్దకు వెళ్లి ఈ మాట చెప్పాడు.

''అదేం కుదరదు. నేను మూడు కన్నా తగ్గను'' అన్నాడు సుబ్బారావు.

శంకరం వచ్చి చెప్పగా ''శంకరం గారు మీతో ముందే చెప్పాను కదండీ. ఎలాగైనా రేటు కుదర్చండి'' అన్నాడు రామ్మూర్తి.




శంకరం ఇలా మరో రెండుసార్లు తిరిగాడుగానీ సుబ్బారావు తగ్గలేదు. రామ్మూర్తి పెంచట్లేదు.

వీళ్ల మధ్య ఎలాగైనా రేటు కుదర్చాలని నిశ్చయించుకున్నాడు.

''అయ్యా సుబ్బారావుగారూ! మీరు తగ్గనని భీష్మించుకు కూర్చుంటే సంబంధాలు కుదరవు. పిల్ల నచ్చింది కాబట్టి మీరు కాస్త తగ్గాలి'' అన్నాడు.

''సరే. నేను కాస్త తగ్గుతాను. మరి వాళ్లను కాస్త పెంచమనండి'' అన్నాడు సుబ్బారావు.

వెంటనే శంకరం వచ్చి ''రామ్మూర్తి గారూ! వాళ్లు కాస్త తగ్గారు. మీరు కాస్త పెంచాలి'' అన్నాడు.

''నేనిచ్చేది ముందే చెప్పాను కదండీ. మళ్లీ పెంచమంటే ఎలా?'' అన్నాడు రామ్మూర్తి.

''అలాగైతే సంబంధాలు కుదరవు. మంచి సంబంధం. కాస్త పెంచండి.''

''సరే అలాగే కానివ్వండి'' అన్నాడు నీరసంగా రామ్మూర్తి.

ఇలా మరో రెండుసార్లు అటూ ఇటూ తిరగాడు శంకరం. వాళ్లు కాస్త తగ్గినా వీళ్లు కాస్త పెంచినా ఇద్దరి మధ్య రేటు మాత్రం కుదరలేదు. చివరికి ఓ నిర్ణయానికి వచ్చి ఇరుపక్షాలతోనూ-

''మీరిద్దరూ చెప్పింది కాక రెండున్నరకు ఖాయం చేసుకోండి'' అన్నాడు.

శంకరం మాట విన్నాక ఇరుపక్షాలలోనూ గుసగుసలు మొదలయ్యాయి.

చివరికి ఇరుపక్షాలవారు రెండున్నరకు ఒప్పుకున్నారు.

వెంటనే ఇక మిగతా విషయాల గురించి సుబ్బారావు ఓ లిస్టు తీసిచ్చాడు శంకరానికి. అందులో-

''వరునికి ఆరు జతల బట్టలు, అప్పగింతలకు వరుని తరపున 10 మందికి బట్టలు, పెళ్లిలో వరునికి కాసు బంగారం ఉంగరం పెట్టాలి. వరుని కాళ్లు వెండి పళ్లెంలో కడగాలి. పెళ్లికి వచ్చే 400మందికి భోజనాలు, నాలుగు రకాల స్వీట్లు, హాట్స్‌తో రుచికరంగా ఉండాలి. ఆడబడుచు, అత్తగారికి పట్టు చీరలుపెట్టి ఘనంగా సత్కరించాలి. పెళ్లి కొడుక్కి, అతని ఫ్రెండ్స్‌కి లాడ్జిలో రూమ్స్ బుక్ చేయాలి. మేము కళ్యాణ మండపానికి రావడానికి కార్లు బుక్ చేయాలి. మేము పెళ్లిలో ఏమడిగినా క్షణాల్లో అందించాలి'' శంకరం మొత్తం గుక్క తిప్పుకోకుండా ఒకసారి రామ్మూర్తి వాళ్ల వంక చూసాడు. వాళ్ల ముఖాలు నీరసం వచ్చి స్పృహ తప్పేటట్లున్నాయి. వెంటనే శంకరం సుబ్బారావుతో-

''ఏమిటండీ ఈ లిస్టు రాసివ్వడం. మరీ ఇన్ని కోర్కెలయితే ఎవరూ ఆడపిల్లలకు పెళ్లి చేయలేరు. పిల్లనిస్తామని మీకూ ఎవరూ అడగరు'' అన్నాడు రామ్మూర్తి.

''అబ్బాయికి ఉంగరం, ఆడపడుచుకి, అత్తగారికి పట్టుచీరలు మాత్రం మినహాయించుకోండి. మిగతావన్నీ ఇచ్చుకుంటాం'' అన్నాడు రామ్మూర్తి.

''మేం లిస్టులో ఇచ్చిన అన్నింటికీ ఒప్పుకుంటేనే పెళ్లి జరుగుతుంది'' అని శంకరంతో ఖరాకండీగా చెప్పేశాడు సుబ్బారావు.

వెంటనే రామ్మూర్తి సుబ్బారావును దగ్గరికి పిలిచి-

''అయితే ఓ పని చేయండి. మీరు మీ అబ్బాయికి మెడలో ఓ బోర్డుమీద మీ కోర్కెలన్నీ రాసి తగిలించి వివాహ వేదిక వద్ద నిలబెట్టండి. అన్నీ నచ్చినవాళ్లే వస్తారు. అప్పుడు సరైన బేరం కుదుర్చుకోవచ్చు. వాళ్లను బాగా దోచుకోవచ్చు'' అనేసి విసురుగా వాళ్లింటి నుండి వెళ్లిపోయాడు రామ్మూర్తి.

-శ్రీ
డాటరాఫ్ కె.కె. రావు
17-21-3, సీతంపేట
రాజమండ్రి-533 104.

★